క్లుప్తంగా

అంబలి పంపిణీ


అంబలి పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: వేసవి తాపాన్ని తట్టుకునేందుకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ప్రజలకు అంబలి పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతినిధులు ఉబెద్‌బిన్ యాహియా మాట్లాడుతూ ప్రతీ శనివారం జిల్లా కేంద్రంలో వారసంతకు ఆయా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వారికి అంబలి పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. సభ్యులు శంకర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలువేరు వెంకన్న, అబ్దుల్లా, నిసార్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్రం సక్కు పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి సక్కు

రెబ్బెన: మండలంలోని పుంజుమేరగూడలో గల భూవమ్మ తల్లి దేవస్థానాన్ని శనివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి బీఆర్‌ఎస్ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కు సందర్శించారు. ఈసందర్భంగా భూవమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నాయకురాలు మర్సుకోల సరస్వతి, నాయకులు వినోద్‌జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

జైనూర్: ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని కళాకారుల బృందం అధ్యక్షుడు పవార్ మోహన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో జిల్లా అధికారుల ఆదేశానుసారం ఆయా ప్రాంతీయ భాషలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఓటు ప్రాముఖ్యత అర్థమయ్యేలా నాటికల ద్వారా మరాఠి, తెలుగు, గోండి, లంబాడి భాషలలో కళ్లకు కట్టేలా వివరించారు. కళాకారులు గొడిసెల బాపు, మరప పురుషోత్తం, ప్రజలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కౌటాల: మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామానికి చెందిన వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోసన్‌కార్ అనిల్ ఇంటి పైకప్పు ఇటీవల ఈదురు గాలులకు పడిపోవడంతో బాధిత కుటుంబానికి శనివారం మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య ఆర్థిక సాయం అందించారు. నాయకులు నాహీం పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షుడి నివాసంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమక్షంలో పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. మంత్రి సీతక్క కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు మద్దెర్ల శ్రీధర్, చిర్రకుంట మాజీ సర్పంచ్ సత్యనారాయణ, తిరుపతితో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద రావు, నాయకులు శ్యాంనాయక్, మల్లేశ్, దత్తు, ప్రతాప్, ఆసిఫ్ పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా ఈవీఎంలు


ఈవీఎంలు పరిశీలిస్తున్న తహసీల్దార్

ఆసిఫాబాద్: లోకసభ ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ నెల 13న పోలింగ్ నిర్వహణకు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్ పాండే పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తెలిపారు.

మంత్రికి మదర్స్ డే కానుక


ఫొటో బహూకరిస్తున్న కోనప్ప, నాయకులు

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: నేడు మదర్స్ డే సందర్భంగా శనివారం సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్‌లో మంత్రి సీతక్కకు తల్లిదండ్రులతో ఉన్న ఫొటోను బహుకరించారు. కోనప్ప సతీమణి కోనేరు రమాదేవి, జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ ఉన్నారు.

బడుల్లో మౌలిక వసతులు

- అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా అభివృద్ధి పనులు
- టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యంపై దృష్టి


లింగాపూర్ పాఠశాలలో కొనసాగుతున్న ఫ్యాన్ రిపేరింగ్ పనులు


గోపాల్‌పూర్ పాఠశాలలో కొనసాగుతున్న మరుగుదొడ్ల మరమ్మతు పనులు

లింగాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆయా పాఠశాలల్లో పనులు నిర్వహించే బాధ్యతలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగించింది. ఈ కమిటీల ద్వారా పాఠశాలల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యం, డోర్లు, మరుగుదొడ్ల మరమ్మతులు, ఫ్లోరింగ్ పనులు చేపడుతున్నారు. గత ప్రభుత్వం మన ఊరు మన బడి పథకం కింద మొదటి దశలో మండలంలోని 10శాతం పాఠశాలలను ఎంపిక చేయగా పనులు పూర్తయ్యాయి. మిగిలిన పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులను అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపడుతున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీరు వంటి సమస్యలను అధిగమించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.

మండలంలో 42 ప్రభుత్వ పాఠశాలలు..

మండలంలోని 42 ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి దశలో 'మన ఊరు మన బడి' కింద 9 పాఠశాలలను ఎంపిక చేయగా లింగాపూర్ ఎంపీపీఎస్, జాముల్‌ధరా, వంజారిగూడ, కొత్తపల్లి, గుంన్నూర్, గౌతమ్‌గూడలో పనులు పూర్తయ్యాయి. ఆయా పాఠశాలల్లో ప్రారంభోత్సవాలు కూడా జరిగాయి. ప్రస్తుతం కొత్తగా ఏర్పడ్డ అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మండలంలో 9 పాఠశాలల్లో మరమ్మతు పనులు చేపట్టారు. ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో 70శాతం పనులు పూర్తయ్యాయి. కాగా అనేక పాఠశాలల్లో ప్రహరీ గోడలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈనేపథ్యంలో ప్రతీ పాఠశాలకు ప్రహరీ నిర్మాణం జరిగేలా అధికారుల ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. మధ్యాహ్న భోజనం కార్యక్రమ పనుల నిమిత్తం వంట గదులు లేని పాఠశాలలను గుర్తించి వాటిని సైతం మంజూరు చేయనున్నారు.

కమిటీలకే పనుల అప్పగింత..

ఇప్పటికే అన్ని పాఠశాలల్లో గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు చైర్‌పర్సన్‌గా, హెచ్‌ఎం కన్వీనర్‌గా కమిటీలు ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న పాఠశాలల యాజమాన్య కమిటీల స్థానంలో కొత్తగా ఏర్పాటు చేసినా అమ్మ ఆదర్శ కమిటీలతోనే అభివృద్ధి పనులు చేపడుతున్నారు. వీటిలో అత్యంత ప్రాముఖ్యమైన టాయిలెట్ల నిర్మాణం, అదనపు గదులు, మైనర్లు రిపేర్లు, తాగునీటి సౌకర్యం వంటి పనులకు మండల స్థాయి నుంచి ప్రతిపాదనలను జిల్లాకు పంపించారు.

పనులు పూర్తి చేస్తాం



అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా గుర్తించిన అన్ని పాఠశాలల్లో అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాల్సి ఉంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే హెచ్‌ఎంలకు దిశా నిర్దేశం చేశాం. మే 31లోగా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

– కుడ్మేతా సుధాకర్, ఎంఈవో, లింగాపూర్

బీజేపీ ఎన్నికల ప్రచారం


రెబ్బెనలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు


ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గేడం నగేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని శనివారం జిల్లా కేంద్రంలోని కాలనీల్లో నాయకులు జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి రావడం పక్కా అన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రె విశాల్, నాయకులు ఎగ్గస్ శ్రీకాంత్, ప్రసాద్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: బీజేపీతోనే దేశానికి రక్షణ ఉంటుందని, మరోసారి మోదీని ప్రధాన మంత్రిగా గెలిపించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని సదాశివపేట గ్రామశివారులో ఉపాధిహామీ పనుల వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

రెబ్బెనలో..

రెబ్బెన: దేశంలో సుస్థిర పాలన కోసం పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని ఆదరించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి కుందారపు బాలక్రిష్ణ అన్నారు. శనివారం మండలంలోని రెబ్బెన, పుంజుమేరగూడ, సింగల్‌గూడ, గంగాపూర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సంజీవ్‌కుమార్, మండల ఉపాధ్యక్షుడు పందర్లి కనకయ్య, పట్టణ అధ్యక్షుడు పసుపులేటి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు శాశ్వత పరిష్కారం

బెజ్జూర్: నియోజకవర్గంలోని పోడు భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచార ముగింపు సందర్భంగా మండల కేంద్రంలోని ఎస్సీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తాను అక్రమ వ్యాపారులతో కుమ్మక్కైనట్లు కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. మండల కేంద్రంలోని రంగనాయక స్వామి ఆలయంలో ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నానని, కాంగ్రెస్ నాయకులు సిద్ధంగా ఉన్నారా అని సవాల్ విసిరారు. జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రావు, బీసీ సెల్ అధ్యక్షుడు సత్యనారాయణ నాయకులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి, లోడుపల్లి, కొండపల్లి గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆదిలాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ తరఫున ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పేదలకు, రైతులకు మేలు చేస్తుందన్నారు. అమలుకు నోచుకోని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తుందన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రైతులకు ఒరిగిందేమి లేదని విమర్శించారు. పోడు రైతులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి నరేంద్ర మోడీని ప్రధాని చేయడానికి బీజేపీని ఆశీర్వదించాలన్నారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు మధుకర్, ఎంపీటీసీ రాజన్న, నాయకులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

పోలింగ్ కేంద్రాన్ని అందంగా అలంకరించాలి


కెస్లాగూడ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో

కెరమెరి: పోలింగ్ కేంద్రాన్ని సుందరంగా అలంకరించాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ అన్నారు. శనివారం మండలంలోని కెస్లాగూడ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అధికారులకు, ఓటర్లకు సౌకర్యాలు కల్పించాలన్నారు. గేటు ఏర్పాటు చేయాలని, టెంటు వేయాలని, చల్లని నీటి సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం కెరమెరి, మోడి పీఎస్‌లను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో అంజద్ పాషా, గ్రామ కార్యదర్శులు శ్రీకాంత్, భీమయ్య, ధర్మయ్య తదితరులు ఉన్నారు.

సిద్ధమవుతున్న పోలింగ్ కేంద్రాలు

మండలంలోని తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని ఐదు పోలింగ్ కేంద్రాలు ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. అంతాపూర్, భోలాపటార్, ముకదంగూడ, గౌరీ, పరంధోళిలో పోలింగ్ కేంద్రాలు ఉండగా, 3357 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. దీంతో విద్యుత్ సౌకర్యాలు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించి శనివారం అన్ని పోలింగ్ కేంద్రాలను నీటితో శుభ్రం చేశారు.

పరిహారం అందజేత

వాంకిడి: మండలంలోని సవాతి పంచాయతీ పరిధి అంతపూర్ గ్రామంలో గురువారం చిరుతపులి దాడిలో లేగదూడ మృతి చెందగా బాధిత రైతు సీడం తానును అటవీశాఖ అధికారులు శనివారం పరామర్శించారు. డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రేవాల్, ఎఫ్‌ఆర్వో అప్పలకొండ ఆదేశాల మేరకు తక్షణ పరిహారం కింద రూ.5వేలు అందజేసినట్లు డిప్యూటీ రేంజర్ సరోజారాణి తెలిపారు. వన్యమృగాల కదలికలను గమనిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని గ్రామస్తులను కోరారు. క్షణికావేశాలకు గురై జంతువులను వేటాడవద్దని సూచించారు. ఎఫ్‌బీవో నాగేందర్, మాజీ సర్పంచ్ దేవ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాలు.. అభివృద్ధికి దూరం

- అసౌకర్యాల మధ్య గిరిజనుల జీవనం
- ఎన్నికల బహిష్కరణలో 'గోవెన' ఓటర్లు


భీమ్‌రెల్ల గ్రామానికి వెళ్లే దారి

తిర్యాణి: స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా నేటికీ చాలా ఆదివాసీ గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. ఇప్పటికీ అనేక గ్రామాలకు రోడ్డు, మంచినీరు, వైద్యం, విద్య, నెటవర్క్ వంటి సదుపాయాలు లేక నానా కష్టాలు పడుతున్నారు. మండలంలోని గోవెన గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలు సైతం కనీస వసతులు లేక అవస్థలు పడుతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన తమ తలరాత మారడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికలు బహిష్కరిస్తామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం సమర్పించారు.

సమస్యల్లో గూడేలు..

జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లోని చాలా గ్రామాల్లో నేటికీ సదుపాయాలు కరువయ్యాయి. తిర్యాణి, లింగాపూర్, సిర్పూర్(యూ), జైనూర్ మండలాల్లోని చాలా వరకు గూడేల్లో మొబైల్ నెట్‌వర్క్ లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో సమాచార మార్పిడికి అష్టకష్టాలు పడుతున్నారు. గ్రామాలకు రవాణా సౌకర్యం కూడా అంతంత మాత్రంగానే ఉంది. మండలంలోని మంగి, గుండాల, కొటగాం, కేరిగూడ, గీసిగూడ గ్రామాలకు రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరైన అటవీ ప్రాంతం కావడంతో అటవీ అధికారులు అనుమతులు ఇవ్వడం లేదు. కనీసం రోడ్డు సౌకర్యం లేక రేషన్, పింఛన్, విద్య, వైద్యం వంటి అవసరాల కోసం కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లి రావాల్సిందే. వార్షాకాలంలో వాగులు ఉప్పొంగి బహ్య ప్రపంచంతో ఆయా గ్రామాలకు సంబంధాలు పూర్తిగా తెగిపోతాయి. గోవెన పంచాయతీ పరిధి నాయకపుగూడలో నేటికీ విద్యుత్ సౌకర్యం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

మస్తు కష్టమవుతుంది

మా గ్రామానికి నేటికీ రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ప్రతీ పనికి ఆరు కిలోమీటర్ల దట్టమైన అడవిలో కాలినడకన వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికే జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులకు సమస్యలపై విన్నవించాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. -మర్సుకోల అశోక్, గుండాల

కనీస సౌకర్యాలు కల్పించాలి

ఆదివాసీ గూడేలకు మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించడం లేదు. ఇప్పటికీ మా గ్రామానికి ఎలాంటి నెట్‌వర్క్ సిగ్నల్స్ లేవు. అత్యవసర సమయంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. - శ్రీనివాస్, భీమ్‌రెల్ల

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం'


లింగాపూర్: ర్యాలీలో పాల్గొన్న సుగుణ


రెబ్బెన: ప్రచారం చేస్తున్న పురాణం సతీశ్‌కుమార్

లింగాపూర్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కంచన్‌పల్లిలో ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణ పేర్కొన్నారు. శనివారం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహాగాం నుంచి లింగాపూర్, పిక్లాతండా, కొత్తపల్లితో పాటు వివిధ గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో లోకేందర్, శేషు, జాదు ఉన్నారు.

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: ఎంపీ ఎన్నికల్లో ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ లక్ష మెజార్టీతో గెలుస్తుందని మంత్రి సీతక్క ధీమా వ్యక్తం చేశారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలో ఎన్నికల ప్రచార ముగింపు సందర్భంగా ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

రెబ్బెన: కాంగ్రెస్‌తోనే దేశంలోని ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయని మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లో కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలనలో దేశంలోని అన్ని వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. నాయకులు ప్రకాశ్‌రావు, శ్యాం, తిరుపతి, రవీందర్, సాంబగౌడ్, గట్టయ్య, విమల, పూదరి సాయికిరణ్ పాల్గొన్నారు.

వాంకిడి: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ కోరారు. శనివారం మండలంలోని ఇందాని గ్రామంలో ఉపాధిహామీ పని ప్రదేశాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలేష్, నాయకులు విజయ్, గణేశ్, రమేశ్, విలాస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తుందని, రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ అన్నారు. శనివారం మండలంలో అప్పపల్లి, ఈదులవాడ, కొమ్ముగూడ గ్రామంలో చివరిరోజు ఇంటింటికి తిరుగుతూ బైక్ ర్యాలీతో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చరణ్, బాలేశ్వర్ గౌడ్, నాయకులు మల్లేశ్, రమేశ్, గోపాల్ నాయక్, సుధాకర్, కళావతి తదితరులు ఉన్నారు.

కౌటాల: కాంగ్రెస్‌తోనే దేశంలోని పేదల అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ మండల నాయకులు పసునూరి తిరుపతి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎంపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

బీజేపీ ప్రభుత్వం గద్దె దిగితేనే కార్మిక హక్కులకు రక్షణ

రెబ్బెన: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపితేనే కార్మిక హక్కులకు రక్షణ ఉంటుందని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. శనివారం గోలేటిలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కార్మిక వర్గమంతా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. నాయకులు జగ్గయ్య, నర్సయ్య, రాజేష్, కిరణ్‌బాబు, అశోక్, దివాకర్, శ్రీను, అంజయ్య, రవి, షమీ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు తాళ్లపెల్లి దివాకర్ గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఏఐటీయూసీ సీపీఎం కూటమి ప్రధాన కార్యదర్శి ఉపేందర్, చిరంజీవి ఉన్నారు.


ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

'గులాబీ జెండా ఎగురవేస్తాం'


ఆసిఫాబాద్‌రూరల్: ప్రచారం చేస్తున్న కోవ లక్ష్మి


లింగాపూర్‌లో..

ఆసిఫాబాద్‌అర్బన్: పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ధీమా వ్యక్తం చేశారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు ఖాయమైందన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్ ఎంపీలు గళమెత్తాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్‌హైమద్, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి సలాం, నాయకులు భీమేష్, రవి, సుగుణాకర్, అశోక్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: లోక్‌సభ ఎన్నికలకు శనివారం చివరిరోజు కావడంతో బీఆర్‌ఎస్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి మండలంలోని గోవింద్‌పూర్, గుండి, దస్నాపూర్ గ్రామాల్లో ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, అలీబిన్, బాపురావు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు తమ ఓటుహక్కు ద్వారా బుద్ధి చెబుతూ బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ఆదివాసీ కోలావాల్ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య అన్నారు. బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కుకు మద్దతుగా శనివారం మండలంలోని పులికుంట, కొత్త పులికుంట, రోళ్లపాడు, నంబాల, తుంగెడ, నారాయణపూర్, కొమురవెల్లి, ఇందిరానగర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ సంఘం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ హనుమక్క, నాయకులు సుధాకర్, భీమయ్య, పోషమల్లు, శంకర్, వెంకటేష్, చిన్నయ్య, సుగుణాకర్, రమేశ్ పాల్గొన్నారు.

కెరమెరి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శనివారం బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. మండలంలోని వివిధ సావర్‌ఖెడా, పార్డ, సుర్దాపూర్, చౌపన్‌గూడ, ఝరి, జ్యోతినగర్, బారేమోడి గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కుకే ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, వైస్‌ఎంపీపీ అబ్దుల్ కలాం, నాయకులు ఆనంద్‌రావు, న్యానేశ్వర్, నారాయణ, కుమురం భీంరావు, రాజయ్య ఉన్నారు.

లింగాపూర్: మండలకేంద్రంతో పాటు పిక్లాతండా, గోపాల్‌పూర్, మాన్కుగూడ, లింగాపూర్ తదితర గ్రామాలలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆత్రం అనిల్ మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేసిందన్నారు. అనంతరం కార్యకర్తలు ఇంటింటా తిరిగి ఆత్రం సక్కు కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జాటోత్ రాహుల్, గోవింద్, అంబాజి, రంజిత్, నాయకులు పాల్గొన్నారు.


కెరమెరి: మాట్లాడుతున్న ఎంపీపీ మోతీరాం


రెబ్బెన: ప్రచారం నిర్వహిస్తున్న పోచయ్య

ఎన్నికల వివరాలు పరిశీలించాలి

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: ఎన్నికల సంబంధిత వివరాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా అదనపు కలెక్టర్, సిర్పూర్ సహాయ ఎన్నికల అధికారి దీపక్ తివారి అన్నారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని జవహర్ నవోదయ పాఠశాల సమావేశ మందిరంలో ఎన్నికల అధికారులతో మాట్లాడారు. ఎంపీ ఎన్నికల నేపథ్యంలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ సిబ్బంది, ప్రిసైడింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండి వివరాలను జాగ్రత్తగా పరిశీలించుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.